నేడు పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఎస్పీ కార్యాలయానికి ఎవరూ రావద్దని సూచించారు. ప్రజలు వినతులను ఆయా పోలీసుస్టేషన్లలో ఇవ్వవచ్చు నని పేర్కొన్నారు.

2024 పెరిగిన హత్యలు.. అత్యాచారాలు

జిల్లా పరిధిలో గతేడాదితో పోలిస్తే హత్యలు, అత్యాచారాలు పెరిగాయి. 2023 తో పోలిస్తే సాధారణ నేరాలు దాదాపు 3.45 శాతం తక్కువగా నమోదయ్యాయి. సైబర్ నేరాలు ఈ ఏడాది అంతకంత పెరగడం ఆందోళన కలిగించే విషయం. నాలుగు నెలలుగా జిల్లా పోలీసు యంత్రాంగం తీసుకున్న ముందస్తు చర్యలతో ఈ ఏడాది నేరాలు కొంత వరకు అదుపులోనే వున్నాయి.





మే 27వ తేదీన చంద్రగిరి మండలం కొంగరవారిపల్లె వద్ద జరిగిన ప్రమాదం

నేరాలు	2023	2024
దొంగతనాలు	775	749
కన్నం వేసినవి	190	212
దోపిడీలు	15	13
హత్యలు	39	52
కిడ్నాప్‌లు	18	25
అత్యాచారాలు	38	49
మోసాలు	443	468
హత్యాయత్నాలు	75	65

ఇంటికి నిప్పుపెట్టి..

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది హత్యలు పెరిగాయి. గతేడాది 39 జరగ్గా.. ఈ ఏడాది ఆ సంఖ్య 52కు చేరుకుంది. వీటిలో ప్రధానంగా.. పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కేసవనగర్ ఘటన చోటుచేసుకుంది. జ్యోతిప్రసాద్, ఆయన భార్య పార్వతి, సమీప బంధువు మహేష్ జనవరి 30న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. వీరి కేకలతో ఇరుగు పొరుగు వారు తలుపులు బద్దలు కొట్టి నీళ్లు పోసి మంటలను అదుపు చేశారు. గాయపడిన ముగ్గురిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలించారు. వారం రోజుల్లో ఈ ముగ్గురూ అసువులు బాశారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

అతివేగం, నిర్లక్ష్యం, నిద్ర, మద్యం మత్తు... ఈ కారణాలతో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. ఈ ఏడాది జిల్లాలో 1048కి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 428 మంది మృత్యువాత పడగా, 1424 మంది గాయపడ్డారు. వీరిలో కొందరు అంగవికలాంగులుగా మారారు. ఈ రోడ్డు ప్రమాదాల్లో ప్రధానంగా.. చంద్రగిరి మండలం కొంగరవారిపల్లె వద్ద జరిగింది. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట నుంచి కారులో ఈ ఏడాది మే 27న వేలూరు సీఎంసీకి బయలుదేరారు. ఎం.కొంగరవారిపల్లె సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొంది. ఈప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరొకరు ఆస్పత్రిలో మరణించారు.

తగ్గిన దోపిడీలు

● ఈ ఏడాది దారి దోపిడీలు, దొంగతనాలు, చోరీలు బాగా తగ్గాయి. ఈ ఏడాది జూన్ 13న రేణిగుంట మండలం నేతాజీ కాలనికి చెందిన చిన్నబ్బ ద్విచక్ర వాహనంపై తిరుచానూరు రైల్వే స్టేషన్ దారిలో రేణిగుంట వైపుకు వెళుతుండగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు నెంబరు ప్లేటు లేని స్కూటీపై వచ్చి ఎనిమిది గ్రాముల బంగారు చైను, అతడి వద్ద ఉన్న రూ.16,000 నగదు, మొబైల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు.



● శ్రీకాళహస్తి పరిధిలోని హ్యాపీ కిచెన్ సెంటరు వద్ద అక్టోబరు 20న జరిగిన దారి దోపిడీ ఘటనలో పెళ్లకూరు మండలం ఆలపాడు గ్రామానికి చెందిన చంద్రయ్య తన సోదరుడు కాకాని తేజతో కలసి ఆటోలో వెళుతుండగా రెండు ద్విచక్రవాహనాల్లో నలుగురు దుండగులు వెంబడించి ఆటో ముందు వుంచి వారిని కొట్టి రెండు సెల్ ఫోన్లు లాక్కొన్నారు. రూ.64,750 నగదు తీసుకెళ్లారు.

పెరిగిన దారి దొంగతనాలు



● సత్యవేడు మండలం తెలుగుగంగ కాలువ సమీపంలోని చిన్నపాండూరు రోడ్డు వద్ద నాగలాపురం మండలం రాజులకండిగ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ద్విచక్ర వాహనంపై అపోలో కంపెనీకి విధులు నిమిత్తం రాత్రి వెళ తున్నారు. ఇద్దరు దుండగులు అతడిని అడ్డగించి కత్తులతో బెదిరించారు. రూ.45,000 విలువ చేసే మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనంతో పాటు నగదు తీసుకుని అక్కడ నుంచి ఉడాయించారు. ఇలా.. ఈ ఏడాది 510 వరకు దారి దొంగతనాలు జరిగాయి.

● ఆగస్టు 27న నాయుడుపేట పట్టణం రాజగోపురం ప్రాంతానికి చెందిన వేముల బాలాజీకి చెందిన లారీలో స్టీలు పైపులు తీసుకొస్తున్నారు. నాయుడుపేట సమీపంలో గుర్తు తెలియని దుండగులు ఆపి దాదాపు రూ.50 లక్షలు విలువ చేసే స్టీలు పైపులున్న లారీని అపహరించుకుని వెళ్లారు.



అత్యాచారాలు.. హత్యాచారాలు

జిల్లా వ్యాప్తంగా గతేడాది 38 అత్యాచారాలు జరగ్గా.. ఈ ఏడాది 49కి పెరిగాయి. డీపీ సత్రం ప్రాంతంలో జూలై 17న ఎనిమిదేళ్ల బాలికను ఓ వ్యక్తి అత్యాచారం చేసి హత్య చేశాడు. నవంబరు 1న వడమాలపేట మండలంలో ఓ బాలికపై సమీప బంధువే హత్యాచారానికి ఒడిగట్టాడు.

వంద శాతం పెరిగిన సైబర్ నేరాలు



జిల్లాలో సైబర్ నేరాలు వంద శాతం పెరిగాయి. గత ఏడాది దాదాపు 320 కేసులు నమోదు కాగా వీటిల్లో సైబర్ పోలీసులు దృష్టికి రానివి మరో 500 వరకు ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది 486 కేసులు నమోదయ్యాయి. వీటిల్లో పోలీసుల దృష్టికి రానివి దాదాపు 1002 ఉండొచ్చని అంచనా. ఈ ఏడాది నమోదైన 486 కేసుల ద్వారా రూ 12.89 కోట్లు పోగొట్టుకున్నట్లు సమాచారం. అధికారిక సమాచారం ప్రకారం రూ.2.36 కోట్లు రికవరీ చేసి బాధితుల ఖాతాల్లోకి జమ చేశారు.



ముగ్గురు చిన్నారుల జలసమాధి

ఫిబ్రవరి 5న.. పాకాల మండలం దామలచెరువు పంచాయతీ ఊటువంకలో సోదరులు పునీత్ (11), కన్నయ్య (9).. వీరి స్నేహితుడు తేజేశ్వర్ (9) బడి నుంచి ఇంటికొచ్చారు. గ్రామ సమీపంలోని పచ్చిపాల ఓబన్న చెరువు వద్ద ఆడుకుంటూ తేజేశ్వర్ చెరువులో పడిపోయాడు. అతడిని రక్షించే ప్రయత్నంలో పునీత్, కన్నయ్య నీటిలో మునిగిపోయి మృతిచెందారు.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ముగిసిన తిరుపతి బాలోత్సవం

● రెండు రోజుల్లో 8,500 మంది హాజరు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నెహ్రూ మున్సిపల్ వేదికగా రెండు రోజులపాటు జరిగిన 'తిరుపతి బాలోత్సవం' ఆదివారం ముగిసింది. 163 ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ళకు చెందిన 8,500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి 30 అంశాల్లో, 70 విభాగాలుగా, 6 సమాంతర వేదికలపై పోటీలు నిర్వహించారు. 3, 4, 5 తరగతి విద్యార్థులను సబ్ జూనియర్స్‌గా, 6, 7 తరగతి విద్యార్థులను జూనియర్స్‌గా, 8, 9, 10వ తరగతి విద్యార్థులను సీనియర్లుగా విభజించి పోటీలు పెట్టారు. చిత్రలేఖనం, బొమ్మకు కథ రాయడం, వ్యాస రచన, ఉక్త లేఖనం, లేఖా రచన, దేశ, ప్రపంచ పటాలను రూపొందించడం, జ్ఞాపకశక్తికి పరీక్ష, చెత్తతో కళాకృతి తయారు, ఏకపాత్రాభినయం, క్లాసికల్, సోలో డ్యాన్స్, క్లాసికల్, సోలో సాంగ్, గ్రూప్ సాంగ్, జానపద పాటలు, దేశభక్తి పాటలు, పౌరాణిక నాటికలు, సంగీత వాయిద్యాల ప్రదర్శన, సంప్రదాయ వస్త్రధారణ, చదరంగం, పదకేళి తెలుగులో మాట్లాడటం, వక్తృత్వం, పద్యం-భావం, కథ చెబుతాను-ఊకొడతావా?, గణితం-తర్కం, మట్టితో బొమ్మల తయారీ, కోలాటం, యోగా, శాస్త్రీయ సంగీతం తదితర పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభ చూపారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు సభలో విజేతలకు నిర్వాహకులు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేశారు.



హ్యాపీగా న్యూ ఇయర్ జరుపుకోండి

● శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
● అనుమతిలేని ఈవెంట్లు నిర్వహిస్తే కేసులు
● ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టీకరణ



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన ఆంగ్ల సంవత్సరాదిని సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. ఈ క్రమంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం చర్యలు తప్పవని ఆదివారం హెచ్చరించారు. డిసెంబరు 31న రాత్రి పది గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని రోడ్లలో చెక్‌పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపడతామన్నారు. మద్యం దుకాణాలు, బార్లను నిర్దేశించిన సమయంలో మూసివేయాలన్నారు. తిరుపతిలోని గరుడ వారధి, యూనివర్శిటీ ఫ్లై ఓవర్‌లను డిసెంబరు 31న రాత్రి 10 గంటలకు మూసివేస్తామన్నారు. రోడ్లు, ఫ్లై ఓవర్లపై నూతన సంవత్సర వేడుకలు నిషిద్ధమని చెప్పారు. మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడితే రిమాండ్‌కు పంపిస్తామని చెప్పారు. అశ్లీల నృత్యాలు, డీజే సౌండ్లు, రికార్డింగ్ డ్యాన్సుల నిర్వహణకు అనుమతుల్లేవన్నారు. బైకులు, కార్ల రేసింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, ప్రైవేటు స్థలాల్లో ఈవెంట్ల నిర్వహణకు అనుమతి తప్పనిసరన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విదేశీయులు ఎవరైనా ఈవెంట్లకు హాజరైతే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పెచ్చులూడుతున్నాయ్ జాగ్రత్త

● సీబీఎస్ అధికారులకు ఆర్టీసీ ఈడీ ఆదేశం

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీహరి బస్టాండు భవనం శిథిలావస్థకు చేరుకుందని, రక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన సెంట్రల్ బస్సు స్టేషన్‌లో పర్యటించారు. శ్రీహరి బస్టాండులో ప్రమాదం పొంచి ఉన్న స్థలాలను ఎంపిక చేసి, బ్లాక్ చేశారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ బస్టాండు గురించి అధికారులతో చర్చించారు. డీపీటీవో జగదీష్, బస్టాండు ఏటీఎం డీఆర్ నాయుడు, డీఈ చెన్నకేశవులు, ఈఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

3న శ్రీకాళహస్తిలో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్

తిరుపతి(విద్య), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్‌పీబీఎస్ జెడ్పీ హైస్కూల్‌లో జనవరి 3న జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్(ఎగ్జిబిషన్) నిర్వహిస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ, ఏపీఎస్‌సీఈఆర్‌టీ, జిల్లావిద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 30న పాఠశాల స్థాయిలో, 31న మండల స్థాయిలో పోటీలు నిర్వహించి ఎంపికైన ప్రాజెక్టులను జిల్లాస్థాయి పోటీలకు పంపాలని సూచించారు. భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, ఎర్త్/స్పేస్‌సైన్స్, పర్యావరణం, ఇంజినీరింగ్, బయోసైన్స్/బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్‌లకు సంబంధించిన ఉప అంశాలలో ప్రాజెక్టులను ప్రదర్శించేలా ప్రోత్సహించాలని సూచించారు. మండల స్థాయిలో వ్యక్తిగత, గ్రూప్, టీచర్ల వారీగా ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. శాస్త్రీయ దృక్పథం, సామాజిక ప్రయోజనకారిగా ఉన్న ప్రాజెక్టులను రూపొందించాలని పేర్కొన్నారు. థర్మకోల్‌తో తయారు చేసిన ప్రాజెక్టులు అనుమతించబడవని, అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాలల నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుతో సైన్స్‌ఫేర్‌లో పాల్గొనాలని సూచించారు.

షార్@99

నేటి ప్రయోగానికి పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్ సిద్ధం


షార్ నుంచి 99వ ప్రయోగం. పీఎస్ఎల్వీ ప్రయోగాల్లో ఇది 62వది. సోమవారం రాత్రి 9.58 గంటలకు పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్ ద్వారా స్పేస్ డాకింగ్‌కు చెందిన 440 కిలోల బరువు గల స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను రోదసీలోకి పంపనున్నారు. ఇప్పటికే షార్‌లో పీఎస్ఎల్వీ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ ఫెసిలిటీ (పీఐఎఫ్)లో రాకెట్ నాలుగు దశల అనుసంధాన పనులు పూర్తిచేసి మొదటి ప్రయోగ వేదిక వద్దకు తరలించారు. స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను అనుసంధానించి అంతరిక్షయానానికి రాకెట్‌ను సిద్ధం చేశారు. ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. కౌంట్‌డౌన్ జరిగే సమయంలో రాకెట్‌లోని రెండు, నాలుగు దశల్లో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ఆదివారం షార్‌కు చేరుకొని ప్రయోగ ఏర్పాట్లో నిమగ్నమయ్యారు. ప్రయోగ నేపథ్యంలో శ్రీహరికోట రాకెట్ కేంద్రం సందడిగా మారింది. మరోవైపు షార్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. షార్ చుట్టుపక్కలతో పాటు సముద్ర మర్గాన కూడా జల్లెడపట్టి గాలిస్తున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



హీట్‌షీల్డ్‌లో అమర్చిన స్పాడెక్స్ ఉపగ్రహాలు





ప్రయోగ వేదికపై ఎగరడానికి సిద్ధంగా.. - పీఐఎఫ్ భవనం నుంచి ప్రయోగ వేదికకు తరలుతున్న పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్

మరోసారి పక్షుల పండుగ తేదీల మార్పు!

తడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ తేదీలు మరోసారి మారే సూచనలు కనబడుతున్నాయి. నాలుగేళ్ల తర్వాత సూళ్లూరుపేట కేంద్రంగా పక్షుల పండుగ నిర్వహించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఆ మేరకు ప్రభుత్వం నుంచి మౌళిక ఆదేశాలు జిల్లా అధికార యంత్రాంగంకు అందాయి. మొదట పక్షుల పండుగను జనవరి 10, 11, 12 తేదీలలో నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. సమయం తక్కువగా ఉండటంతో ఆ తేదీలను జనవరి 17, 18, 19 తేదీలకు మార్చారు. ఆమేరకు అధికారులు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. సంక్రాంతి పండుగ, నాయుడుపేటలో మూడు రోజులపాటు ఏటి పండుగ అవే రోజుల్లో జరగనున్నాయి. ఈ క్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆ తేదీలను మార్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌కు తేదీల మార్పును సూచించినట్లుగా తెలుస్తుంది. పండగ తేదీలలో పాఠశాలలకు సెలవుదినాలు కావడంతో ఊర్లకు వెళ్లిన విద్యార్థులు పక్షుల పండుగను వీక్షించే అవకాశం ఉండదు. ఈ క్రమంలో తేదీల మార్పును ప్రతిపాదించామని, అందరికీ అనుకూలమైన తేదీలలోనే పక్షుల పండుగ నిర్వహిస్తామని ఆదివారం ఎమ్మెల్యే విజయశ్రీ మీడియాకు తెలిపారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వారాంతం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 29వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,784మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,638మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,831మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,041, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 296మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 282మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 102మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 22,116 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.



3న నారావారిపల్లెలో మెగా జాబ్‌మేళా

● ఎమ్మెల్యే పులివర్తి నాని



జాబ్‌మేళా పోస్టరు ఆవిష్కరిస్తున్న పులివర్తి నాని,తదితరులు

తిరుచానూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ని యోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. జనవరి 3న నారావారిపల్లెలో జరగనున్న మెగాజాబ్‌మేళా పోస్టర్లను ఆదివారం తిరుచానూరు రఘునాథరిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి తదితర సంస్థల ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. 20 బహుళ జాతీయ సంస్థల్లో 1,200 పోస్టుల భర్తీ జరుగుతుందన్నారు. 5వ తరగతి నుంచి బీటెక్ వరకూ చదివిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలుంటాయన్నారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 9160912690 నంబరులో సంప్రదించవచ్చని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకనాథం తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణలో టీడీపీ నేతలు శ్రీధర్‌వర్మ, అమిలినేని మధు, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నాయిగుంటకు కొత్త రోడ్డు వచ్చిందోచ్



తిరుపతి అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): న్యూమంగళం పంచాయతీ పరిధిలోని చెన్నాయిగుంట గ్రామంలో రహదారి వెతలు తొలగాయి. రూ. 36లక్షలతో సిమెంటు రోడ్డు ఏర్పాటుచేశారు. కరకంబాడి రోడ్డు ప్రధాన రహదారి నుంచి చెరువుమీదుగా వ్యవసాయ పొలాలపై చెన్నాయిగుంటకు గతంలో తారురోడ్డు ఉండేది. గత ఐదేళ్లలో ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. దాంతో ఆరోడ్డు గుంతలు తేలిపోయి గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే రూ. 36లక్షలతో గతనెల రెండో వారంలో ప్రారంభమైన సీసీరోడ్డు పనులు తాజాగా పూర్తయ్యాయి. రాకపోకలను ప్రారంభించారు. కొత్తరోడ్డు నిర్మాణంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా చెరువుకట్టపై సీసీ రోడ్డు వేయడానికి వీలుపడకపోవడంతో కొంచెం దూరం ఇంకా గుంతలతో ప్రయాణించాల్సి వస్తోంది. ఇక్కడ కూడా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నాగాలమ్మ ఆలయ కమిటీపై మళ్లీ వివాదం

చంద్రగిరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నాగాలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ వివాదం చల్లారినట్టు లేదు. ఆదివారం ఆలయం ఆవరణలో వెంకటంపేట, రాయలపురం, చంద్రగిరి పరిసర గ్రామ పెద్దలు, పినపెద్దలు సమావేశమయ్యారు. గ్రామ పెద్దలు అడహక్ కమిటీని ప్రకటించారు. కమిటీ ద్వారా ఆలయ స్థల దాత వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి వద్దకు వెళ్లి స్థలాన్ని ఆలయ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిర్ణయించారు. తరువాత కొత్త కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. అయితే ఈనియామకం చెల్లందంటూ ఒంటి శివశంకర్‌రెడ్డి వర్గం వాదన వినిపించింది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వావాదం జరిగింది. తర్వాత పెద్దలు నిర్ణయించిన కమిటీ ద్వారానే పూజలు, నిర్వహణ జరుగుతుందని ఒక వర్గం పేర్కొనగా సంక్రాంతి తరువాత కొత్త కమిటీని ప్రకటిస్తామని మాజీ చైర్మన్ శివశంకర్ రెడ్డి తెలిపారు. రెండు వర్గాలూ వేర్వేరుగా విలేకర్ల సమావేశం నిర్వహించాయి.

జానపద వృత్తి కళాకారుల గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే ఆరణి



ఎమ్మెల్యే శ్రీనివాసులును సత్కరిస్తున్న కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జానపద వృత్తి కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ఎన్నుకున్నారు. జానపద వృత్తి కళాకారుల సంఘ సమావేశం ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కోరారు. తిరుపతిలో ఆధ్యాత్మిక శోభ మరింత ఉట్టిపడేలా నగర సంకీర్తన చేపట్టాలని సూచించారు. కళాకారుల సమస్యలను టీటీడీ చైర్మన్, ఈవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జానపద వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ 2022 నుంచి హిందూ ధర్మ ప్రచార పరిషత్‌లో కొత్త భజన మండళ్లను నమోదు చేస్తామని ఉత్తర్వులు ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. సంఘ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. సంఘం సలహాదారు నరసింహులు నాయుడు, కార్యదర్శి మునీంద్ర, నారాయణ, నగేష్, నాగమల్లి, మహదేవరావు, రవిచంద్రారెడ్డి, జయప్ప, అంజయ్య, వెంకటలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



తిరుపతి రూరల్, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి కృషి చేస్తానని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రూరల్ మండలం పాతకాల్వసమీపంలో చేపట్టనున్న భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కొత్త సంవత్సరం క్యాలెండరును సంఘ ప్రతినిధులతో కలసి ఆయన ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు పులిపాటి పురంధరనాయుడు, కార్యదర్శి గుర్రప్పనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమూరి జయరామ్‌ప్రసాద్, కోశాధికారి డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, ఊట్ల సురేంద్రనాయుడు, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం ఐదు గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి నాలుగు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో ఆరు కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

●శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.45 కోట్లు ●శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,414 ●తలనీలాలు సమర్పించిన వారు: 26,100

-తిరుమల(ఆంధ్రజ్యోతి)

పార్వేటమండపం వద్ద రెండు కార్లు ఢీ

తిరుమల, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): తిరుమల పాప వినాశనం మార్గంలోని పార్వేటమండపం వద్ద ఆదివారం స్వల్ప రోడ్డుప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న ఓ ట్యాక్సీని వెనుక వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ఎర్రావారిపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై డివై స్వామి తెలిపిన వివరాలిలా.. మండలంలోని చింతగుంట పంచాయతీ సుబ్బరామాపురానికి చెందిన జి జయరామయ్యవెంకటలక్ష్మి (62) దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారికి పెళ్లిళ్లు చేశారు. కూలి పనులు చేసుకునే జయరామయ్య దంపతులు తరచూ గొడవలు పడేవారని సమాచారం. ఈ క్రమంలోనే ఆదివారం కూడా వారి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో వెంకటలక్ష్మి విషరసాయన గుళికలు మింగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఇరుగుపొరుగువారు గమనించిన ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. ఈదశలోనే ప్రాణం విడిచింది. దీంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై స్వామి తెలిపారు.

15న శ్రీవారి ప్రణయ కలహోత్సవం

తిరుమల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర స్వామి తన దేవేరులతో కలిసి పాల్గొనే కలహ శృంగార భరితమైన ప్రణయకలహోత్సవం జనవరి 15వ తేదీన తిరుమలలో జరుగనుంది. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని సాయంత్రం 4 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను బంగారు పల్లకీలపై వేర్వేరుగా వైభవోత్సవ మండపం నుంచి ఊరేగింపుగా బయల్దేరి శ్రీవరాహస్వామి ఆలయం వద్ద ఒకరికొకరు ఎదురేగుతారు. అక్కడ అర్చకులు స్వామి, అమ్మవార్ల తరపున వేర్వేరుగా ఆళ్వారు దివ్యప్రబంధంలోని పాశురాలను స్తుతిస్తారు. ఆతర్వాత అమ్మవార్లు స్వామిని నిందాస్తుతి చేశాక ఒకరిపై ఒకరు పూలబంతులను విసరడం, స్వామి పుష్పఘాతం నుంచి తప్పించుకోవడం వంటి ఆసక్తికరమైన సన్నివేశాలతో ఈ ప్రణయకలహ మహోత్సవం నిర్వహిస్తారు. ఇక, జనవరి నెలలో 18న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం, 29న పురంధరదాస ఆరాధన మహోత్సవాలు కూడా జరగనున్నాయి.

జోరుగా క్రీడా పోటీలు

వరదయ్యపాళెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వచ్ఛ్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరిగాయ, వాలీబాల్ పోటీల్లో 32 జట్లు పాల్గొనగా చిలమత్తూరు విజేతగా నిలిచింది. కబడ్డీ పోటీల్లో 8 జట్లు పాల్గొనగా వరదయ్యపాళెం దళితవాడ జట్టు విజయం సాధించింది. మావుడూరు మోహన్, మునిచంద్రారెడ్డి, ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పులివర్తి నాని- బోట్ పోటీల శిక్షణలో క్రీడాకారులు

జాతీయ బోట్ చాంపియన్ పోటీల నిర్వహణకు కృషి

రాయలచెరువులో డ్రాగన్ బోట్ పోటీల శిక్షణను పరిశీలించిన ఎమ్మెల్యే నాని

రామచంద్రాపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం అంగీకారం తీసుకుని రాయలచెరువులో వచ్చే ఏడాది డ్రాగన్ బోట్ చాంపియన్ పోటీలను నిర్వహిస్తామని ఎమ్మెల్యేపులివర్తి నాని పేర్కొన్నారు. రాయలచెరువులో నిర్వహిస్తున్న డ్రాగన్ బోట్ శిక్షణా తరగతులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ రాయలచెరువును పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. వివిధజిల్లాల నుంచి 50మంది క్రీడాకారులకు ఇక్కడ డ్రాగన్ బోట్ పోటీలకు శిక్షణ పొందుతున్నారన్నారు. ఈ నెల31న జాతీయ పోటీలకు ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైనవారు ఢిల్లీలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే మొక్కలను నాటారు. క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. జిల్లా క్రీడాభివృద్ధికారి సయ్యద్, కెనాయింగ్ కయాకింగ్ అసోసియేషన్ చైర్మన్ ప్రదీప్‌నాయుడు, తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, జనార్దన చౌదరి,జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈనెల 26 నుంచి బోట్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు





బోట్ పోటీల శిక్షణలో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

తిరుపతిలో స్ట్రీట్ ఫుడ్ హబ్

● చిరువ్యాపారులకు అండగా ఉంటామన్న కేంద్ర మంత్రి



వీధి విక్రయదారులతో మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'దేశవ్యాప్తంగా వంద స్ట్రీట్ ఫుడ్ హబ్‌ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. తిరుపతి జిల్లాలోనూ స్ట్రీట్ ఫుడ్ హబ్ ఏర్పాటు కానుంది' అని కేంద్ర ఆయుష్, ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం ఆహార భద్రత ప్రమాణాలపై తినుబండారాల చిరువ్యాపారులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు శుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యంగా వీధి.. చిరువ్యాపారులకు శిక్షణ ఇవ్వడమన్నారు. కేంద్ర ప్రభుత్వం చిరువ్యాపారులకు, వీధివిక్రయదారులకు అండగా ఉంటుందన్నారు. అంతకు ముందు వీధి వ్యాపారులతో మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సౌత్‌రీజనల్ డైరెక్టర్ పంచమ్, రాష్ట్ర జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఐపీఎం పూర్ణచంద్రరావు, తెలింగాణా డిప్యూటీ డైరెక్టర్ బాలు నాయక్, తిరుపతి డీఆర్వో నరసింహులు, తిరుపతి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ట్రైనర్ అంజనేయులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు మద్దిలేటి జగదీష్, నర్మద తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో ప్రముఖులు





ఆలయం వద్ద సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీ రమణ- కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్

తిరుచానూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని ఆదివారంపలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు దర్శించుకున్నారు. మధ్యాహ్నం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. వారికి ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, అర్చకుడు శ్రీనివాసాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐలకు సన్మానం



తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెస్ట్ పోలీసు స్టేషన్‌లో పదవీ విరమణ చేసిన ఇద్దరు ఏఎస్‌ఐలను ఆదివారం డీఎస్పీ వెంకటనారాయణ సన్మానించారు. 38 ఏళ్లపాటు డిపార్టుమెంటులో పనిచేసి ఎన్నో కేసులు ఛేదించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'మోహన్‌బాబు వల్ల నాకు ప్రాణహాని'



మాట్లాడుతున్న చెంగల్‌రాయులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలోని విద్యానికేతన్ విద్యాసంస్థల అధినేత, సినీ నటుడు మోహన్‌బాబు వల్ల తనకు ప్రాణహాని ఉందని ప్రజా సంకల్ప వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఏల్పూరి చెంగల్రాయులు చెప్పారు. ఆయన అక్రమ నిర్మాణాలపై పోరాటం చేస్తున్నందుకే తనపై తప్పుడు కేసులు బనాయించేందుకు చూస్తున్నారన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం చెంగల్రాయులు మాట్లాడుతూ.. విద్యానికేతన్ విద్యాసంస్థల పరిధిలో వాగు, గుంట పొరంబోకు భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. వీరి కళాశాల నుంచి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసేందుకు తన సొంత డబ్బుతో ప్లాంట్ నిర్మిస్తానని అప్పటి కలెక్టరుకు చెప్పి అనుమతులు పొందిన ఆయన.. చివరకు ఎంపీ, తుడా నిధులు వాడారన్నారు. పుల్లయ్యగారిపల్లె రెవెన్యూ పరిధిలో వాగు భూమిగా ఉన్న భూములను పేదల భూములుగా పట్టాలు మార్చి ప్రభుత్వం నుంచి తక్కువ ధరతో సాయినాథా సేవా సమితి పేరుతో తీసుకున్నారన్నారు. వీటిపై తాను న్యాయ పోరాటం చేస్తుండటంతో కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని విమర్శించారు. చంద్రగిరి పోలీసు స్టేషనులో తనపై కేసు పెట్టారన్నారు. స్టేషనుకు వెళితే తనపై ఒత్తిడి తెచ్చి కేసు వెనక్కి తీసుకునే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.

బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఆటలు, ముగ్గుల పోటీలు

రేణిగుంట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ వేడుకలు అప్పుడే ప్రారంభమయ్యాయి. పట్టణంలోని బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల పేరుతో ఆటలు, ముగ్గుల పోటీలను నిర్వహించారు. రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి రెడ్డిప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలు నువ్వానేనా అన్నట్లుగా ఆసక్తికరంగా సాగాయి. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు మాట్లాడుతూ తిరుపతి బైరాగి పట్టెడలోని వైఖానస కల్యాణ మండపంలో ఫిబ్రవరి 16న రాష్ట్ర బ్రాహ్మణ వధూవరుల వివాహక పరిచయ వేదిక కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమైక్య, బ్రాహ్మణ సమాజం సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు.

మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం స్థల పరిశీలన

శ్రీకాళహస్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ము క్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నిర్మించ బోయే రోడ్డు కోసం అధి కారులు స్థల పరిశీలన చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మాస్టర్ ప్లాన్ పనుల్లో భాగంగా భక్తుల వాహనాలను సన్నిధివీధి నుంచి లోబావికి మళ్లించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. భరద్వాజ తీర్థంలో మొత్తం వాహనాల పార్కింగ్ చేయించేలా కసరత్తు చేస్తున్నారు. రానున్న మహాశివరాత్రి లోగా సన్నిధివీధిలో పూర్తిగా ట్రాఫిక్ సమస్యను నిర్మూలించేందుకు 40 అడుగుల వెడల్పుతో కొత్త రోడ్డు నిర్మిం చేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి అధికారులతో కలిసి సన్నిధివీధిలోని ఎంజీఎం హోటల్ పక్కన స్వర్ణముఖి నది కట్ట, టూరిస్టు బస్టాండు, భరద్వాజ తీర్థం ప్రాంతాల్లో పర్యటించారు. అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. 17సెంట్ల ప్రైవేటు స్థలాన్ని సేకరించాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించారు. భూసేకరణకు కసరత్తు ప్రారంభించారు

ముగిసిన పవన్ కల్యాణ్ జాతీయ నాటకోత్సవాలు





పవన్ కల్యాణ్ జాతీయ నాటకోత్సవాల నిర్వాహకుడు కోనేటి సుబ్బరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు -ఎస్ నేనే నాటక సన్నివేశం

● ఆకట్టుకున్న ఆంగికం భువనంయస్య నాటకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవితమే ఒక రంగస్థలమని ఆంగికం భువనంయస్య నాటకం తేల్చి చెప్పింది. మూడు రోజులుగా తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో సుబ్బరాజు నాట్య కళా పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన పవన్ కల్యాణ్ జాతీయ నాటకోత్సవాలు ఆదివారం ముగిశాయి. విజయవాడకు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ఆంగికంభువనంయస్య నాటకం జీవితమే రంగస్థలమనీ, అందరూ నటులేననీ, సమాజంలో ఎవరి పాత్రలు వారు నటించి మాయమైపోతారని స్పష్టం చేసింది. కళాతపస్వి కోనేటి సుబ్బరాజు రచన, దర్శకత్వంలో ప్రదర్శించిన ఎస్ నేనే నాటకం ఆద్యంతమూ ఆకట్టుకుంది. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి, పవన్ కల్యాణ్ జాతీయ నాటకోత్సవాల నిర్వాహకులు కోనేటి సుబ్బరాజు తదితరులు కళాకారులను సత్కరించారు. దర్శకులు దేవిరెడ్డి రామకోటేశ్వరరావుకు నటరత్న ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ప్రముఖ కళా పోషకులు, సామాజిక కార్యకర్త డాక్టర్ షేక్ ఫరీద్‌భానును విశ్వనట చక్రవర్తి బళ్లారి రాఘవ జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో సుబ్బరాజు నాట్య కళా పరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు, ఉపాధ్యక్షులు ఆమూరి సుబ్రమణ్యం, డి.గోపాలరావు, కె.కేశవులు, జాయింట్ సెక్రటరీ చంద్రబాబు నాయుడు, కార్యవర్గ సభ్యులు డి.మునిశేఖర్, జి.నారాయణస్వామి, ఎం.గంగయ్య పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- తొలి ఉత్తమ నాటక ప్రదర్శన: కాకినాడ బీవీకే క్రియేషన్ వారి 'తితిక్ష'
- ద్వితీయ స్థానం: విజయవాడ అభ్యుదయ ఆర్ట్స్ 'ఆంగికంభువనంయస్య'
- తృతీయ స్థానం: అనకాపల్లె షిరిడీసాయి క్రియేషన్స్ 'ఆశకదరా శివా'
- ప్రోత్సాహక బహుమతి: హైదరాబాదు సీఏఎంఎస్ వారి 'అనగనగా ఒకరాజు-అనగనగా ఒక రాణి' నాటకం
- ఉత్తమ రచన: అనంత హృదయరాజు (ఆంగికం భువనంయస్య నాటకం)
-ఉత్తమ దర్శకుడు: డి.వినయ్ (తితిక్ష నాటకం)
- ఉత్తమ నటుడు: చైతన్యరాజు పాత్రధారి (అనగనగా ఒకరాజు- అనగనగా ఒకరాణి నాటకం)
-ఉత్తమనటి: సరిత-సునందిని పాత్రధారిణి (ఆంగికంభువనంయస్య నాటకం)
-ఉత్తమ క్యారెక్టర్ నటుడు: పొన్నాడ ముత్యాలరావు (ఆశకదరా శివా నాటకం- రాఘవ పాత్రధారి).
-ఉత్తమ క్యారెక్టర్ నటి: జగదీశ్వరి (నిన్ను నువ్వు తెలుసుకో నాటకం- జానకి పాత్రధారి)
-ఉత్తమ ప్రతినాయకురాలు: శ్రీజ సాదినేని (ఆశకదరాశివా - కరుణ పాత్రధారి)
-ఉత్తమ సంగీతం: రమణ (తితిక్ష నాటకం)
-రంగాలంకరణ: పి.బాబురావు (తితిక్ష నాటకం)
-ఆహార్యం: ఉమా ఆర్ట్స్ అకాడమీ (కాకినాడ)
-రంగోద్దీపన: సురభి సంతోష్ (తితిక్ష నాటకం)

జూరీ బహుమతులు: దయాకరరావు పాత్రధారి ఆళ్ల జనార్దనరావు (పుత్రదేవోభవ నాటకం), ఆనంద్ పాత్రధారి ఎస్‌కె రసూత (హెచ్చరిక నాటకం), రవి పాత్రధారి ఆర్‌కే నాయుడు (హెచ్చరిక నాటకం), ఆనందరావు పాత్రధారి నూకరాజు (నిన్ను నువ్వు తెలుసుకో).

ట్రెక్కింగ్ సందడి



జలపాతం వద్ద సందడి చేస్తున్న అడ్వెంచర్ అడిక్ట్ టీమ్

తిరుపతి అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అడ్వెంచర్ అడిక్ట్స్ టీమ్ ఆదివారం మామండూర్ ఫారెస్టులో సందడి చేసింది. సండే ట్రెక్కింగ్‌లో భాగంగా ఈ వారం మామండూర్ అడవుల్లో ట్రెక్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు శేషాచల అడవుల్లో జలపాతాలు జోరుగా ప్రవహిస్తున్న సమాచారం అందుకుని సూర్యోదయంతో అడవిలోకి ప్రవేశించారు. జలపాతాలను ఎంపిక చేసుకుని ట్రెక్కింగ్ చేశారు. తిరుపతితో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి 50 మందికి పైగా పాల్గొన్నారు. ఎత్తైన కొండల నుంచి దూకుతున్న జలపాతాలు, బండల నడుమ సుడులు, మలుపులు తిరుగుతూ ప్రవహించిన నీరు, పక్షుల కిలకిలారావాల మధ్య ట్రెక్కింగ్ చక్కటి అనుభూతి ఇచ్చిందని పేర్కొన్నారు.

శ్రీవారిమెట్టు వ్యాపారుల సమస్యను పరిష్కరించాలి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు వద్ద చిరు వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు పి.మధు డిమాండ్ చేశారు. టీటీడీ పరిపాలనా భవనం ఎదుట 132 రోజులుగా దీక్ష చేస్తున్న వ్యాపారులకు ఆయన ఆదివారం సంఘీభావం తెలిపారు. చిన్న వ్యాపారాలు చేసుకునే వారిని అడ్డుకోవడం సరికాదన్నారు. సుదీర్ఘకాలంగా పోరాటాలు చేస్తున్నా టీటీడీ పాలకమండలి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం చొరవ తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, చిరు వ్యాపారుల సంఘ నాయకులు యుగంధర్, చిట్టిబాబు, చిరంజీవి, పెంచలయ్య పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో రైల్వే గుంతకల్లు డీఆర్ఎం

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మేనేజరు సి.ఎస్.గుప్తా ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గుంతకల్లు డివిజన్ మేనేజరుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన బెంగళూరు నుంచి ఆదివారం ఉదయం తిరుపతికి చేరుకుని, తిరుమల శ్రీవారిని, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకుని గుంతకల్లుకు వెళ్లారు. సోమవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. టికెట్ తీసుకుని మైసూరు ప్యాసింజర్‌లో ప్రయాణం చేయడంతో అధికారులు అవాక్కయ్యారు.

హోరాహోరీగా స్పీడ్, రిలే స్కేటింగ్ పోటీలు



తిరుపతి(ఆర్సీసీ), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో రాష్ట్రస్థాయి స్పీడ్, రిలే స్కేటింగ్ పోటీలు శని, ఆదివారాల్లో హోరాహోరీగా జరిగాయి. అండర్ 4నుంచి అబవ్ 19 వరకు ఎనిమిది విభాగాలలో పోటీలు నిర్వహించారు. అన్ని విభాగాలలో రాణించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కేటింగ్ జట్టు చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. రెండు, మూడు స్థానాల్లో విశాఖపట్నం, అనంతపురం జట్లు నిలిచాయి. అన్ని విభాగాల నుంచి స్పీడ్ స్కేటింగ్‌లో 40మంది, రిలేలో 40మందిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఐసీడీఎస్ సీడీపీవో కె.పద్మజ, స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ మురుగానందం, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఆర్.ఎన్.శ్రీనివాస్, రమణ మహర్షి ఆశ్రమ ఇన్‌చార్జ్ రమణమహేష్ విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. వీరు జనవరి 31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

భరత్‌కుమార్‌శర్మ తిరుపతికి గర్వకారణం



భరత్‌కుమార్‌శర్మను సన్మానిస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు, సంస్కృత భాషల ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడానికి ప్రయత్నిస్తున్న అవధాని ఉప్పలదడియం భరత్‌కుమార్‌శర్మ తిరుపతికి గర్వకారణమని జాతీయ సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. గురువు వద్దిపర్తి పద్మాకర్‌తో కలిసి దుబాయ్, యూఏఐ దేశాల్లో భరత్‌కుమార్‌శర్మ అవధానం నిర్వహించారు. తిరుపతిలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వీసీ మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ప్రతిభను కనబరుస్తూ అవధాన కళను విశ్వవ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, చిగోర ఆధ్యాత్మిక సేవా కేంద్రం స్థాపకులు చిత్రపు హనుమంతరావు, కార్యదర్శి రాజా, ఏపీ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మేనేజర్ పీఆర్ఎల్ కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఓవర్ స్పీడు, ట్రిబుల్ రైడింగ్, లైసెన్సులు లేకుండా తిరిగే వాహనాలపై పోలీసులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆదివారం ఎమ్మార్‌పల్లి సర్కిల్, యూనివర్సిటీ ఫ్లైఓవర్, విద్యానగర్ సర్కిల్, మహిళా వర్సిటీ కూడలి, తుమ్మలగుంట తదితర ప్రాంతాల్లో సీఐ రామయ్య ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. దాదాపు 150 వాహనాలను తనిఖీ చేసి, లైసెన్సులు లేని వాటిపై కేసులు నమోదు చేశారు. అపరాధ రుసుం విధించారు.

అపుస్మా రాయలసీమ అధ్యక్షుడిగా విశ్వనాథరెడ్డి



విశ్వనాథరెడ్డిని అభినందిస్తున్న అపుస్మా నేతలు

తిరుపతి(విద్య), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) రాయలసీమ జోన్ అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన విశ్వం స్కూల్స్ అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర నేతలు, సహకరించిన కరస్పాండెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎంపీ రామచంద్రారెడ్డి, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తులసివిష్ణుప్రసాద్, లీగల్ అడ్వైజర్ కేఎస్‌వాసు, రెడ్డి శ్రీధర్‌రెడ్డి, సంగరాజు భాస్కర్‌రాజు, టి.రామకృష్ణారెడ్డి, డీజీ రఘునారాయణ, బి.వెంకటేశ్‌బాబు, మనోహర్ తదితరులు ఆయన్ను అభినందించారు.

బీసీల అభివృద్ధికి నూతన కమిటీ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని బీసీల అభివృద్ధి కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లా బీసీ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేలూరు జగన్నాథం తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కమిటీ కో-ఆర్డినేటర్‌గా పీబీ లక్ష్మీప్రసన్న కుమార్, మహిళా కో-ఆర్డినేటర్‌గా ఎం.దేవి, తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా తురకా అమరనాథ్, ఉపాధ్యక్షుడిగా అట్ల కిషోర్, అధికార ప్రతినిధిగా కొండా రామారావు, సంయుక్త కార్యదర్శిగా నీలం వెంకటేశ్వర్లును ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

108 ఉద్యోగుల జీతాల పెంపు హర్షణీయం

తిరుపతి(వైద్యం), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : 108 ఉద్యోగులకు జీతాల పెంపు నిర్ణయం హర్షణీయమని 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటీ, పైలట్‌లకు రూ.4 వేల వేతనాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్ల సకాలంలో జీతాలు అందక, వాహనాలు మరమ్మతులు నోచుకోక ఇబ్బందులు పడ్డామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే 108 ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపడమేగాక వేతనాలు పెంచడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

బాలమందిర్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



తిరుపతి అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర బాలమందిర్ విద్యార్థులకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు రూ.16.64లక్షల విలువ చేసే స్కూల్ యూనిఫాం అందజేశారు. బ్యాంకు ఛైర్మన్ చల్లా శ్రీనివాసులశెట్టి ఆదివారం బాలమందిరాన్ని సందర్శించి, తన చేతుల మీదుగా విరాళాన్ని అందజేశారు. బ్యాంకు సీజీఎం రాజేష్‌కుమార్‌పటేల్, జీఎం సంజయ్‌కుమార్, డీజీఎం లేఖా మీనన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో చిన్నారుల్లో మానసిక ఉత్తేజం

బాలోత్సవం సమాపనోత్సవంలో వక్తలు





విద్యార్థినుల కళాప్రదర్శనలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆటపాటలతో విద్యార్థులకు మానసిక ఉత్తేజం కలుగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. రెండు రోజులుగా తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ వేదికగా నిర్వహించిన తిరుపతి బాలోత్సవం - పిల్లల పండుగ ఆదివారం ముగిసింది. సమాపనోత్సవంలో పాస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మురళీకృష్ణ, హెల్పింగ్ టు అదర్స్ ప్రతినిధి మణికంఠ, కోరా విజయ, ప్రభావతికాశయ్య, రోటరీ క్లబ్ అధ్యక్షుడు భాగ్యమ్మ, సుజిత్, ఏనుగు అంకమ నాయుడు, సంకల్ప నాగరాజు, చెన్నూరు సుబ్రమణ్యం మాట్లాడుతూ మూడేళ్లుగా నిర్వహిస్తున్న తిరుపతి బాలోత్సవానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచీ మంచి ప్రోత్సాహం లభిస్తోందన్నారు. విద్యార్థుల మెదడులో కొత్త ఆలోచనలు మొలకెత్తాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. చిన్నారుల మేధస్సుకు మరింత పదును పెట్టేలా బాలోత్సవాన్ని తీర్చిదిద్దినట్టు చెప్పారు. కార్యక్రమంలో తిరుపతి బాలోత్సవం వ్యవస్థాపకుడు మల్లారపు నాగార్జున, గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం, అధ్యక్షులు నడ్డి నారాయణ, ఉపాధ్యక్షులు సుంకర రెడ్డెప్ప, కార్యదర్శి పయ్యావుల గురునాథం, కోశాధికారి పుంగ్రోతు పంచముఖేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, ఆఫీసర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి, రచయితలు ఆర్సీ కృష్ణస్వామిరాజు, షాజహాన్ పాల్గొన్నారు.

బాలోత్సవం.. గొప్ప సంప్రదాయం : మధు

తిరుపతిలో బాలోత్సవం-పిల్లల పండుగ ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తుండడం గొప్ప సంప్రదాయమని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీ పెనుమల్లి మధు కితాబిచ్చారు. సీపీఎం నేత కందారపు మురళితో కలిసి ఆదివారం సాయంత్రం ఆయన బాలోత్సవాన్ని తిలకించారు. చిన్న నాటి నుంచే విద్యార్థులకు సాహిత్యం, కళలు, క్రీడలు వంటి అంశాలపై మక్కువ కల్పించడం ద్వారా సమాజం పట్ల అవగాహన పెరగడంతో పాటు బాధ్యత అలవడుతుందని అభిప్రాయపడ్డారు. బాలోత్సవం నిర్వాహకులను అభినందించారు.



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యం



చిన్నారుల కోలాట ప్రదర్శన





మట్టి బొమ్మల తయారీ పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులు తయారు చేసిన గణేశుడి ప్రతిమ



తిరుపతిలో మతోన్మాదుల ఆట కట్టించాలి



సదస్సులో మాట్లాడుతున్న మధు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరంలో మతోన్మాద శక్తుల ఆగడాలను అరికట్టాలని రాజ్యసభ మాజీ సభ్యుడు పి.మధు, రాజ్యాంగ పరిరక్షణ కన్వీనర్ పి.అంజయ్య డిమాండ్ చేశారు. బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్రస్థాయి సదస్సులో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆగడాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ మతోన్మాద శక్తులతో కలసి తిరుపతి పుణ్యక్షేత్రంలో అశాంతిని నెలకొల్పుతున్నారని మండిపడ్డారు. టీటీడీలో అనునిత్యం ఒక అంశాన్ని ఆధారంగా చేసుకుని మత ఘర్షణలు సృష్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మతోన్మాద శక్తులను అణచివేయాలని కోరారు. సదస్సులో సీపీఐ నాయకులు ఈశ్వరయ్య, పి.మురళి, పౌరహక్కుల సంఘ నాయకులు క్రాంతి చైతన్య, సీపీఎం నాయకులు నాగరాజు, కందారపు మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాంగాటి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ



తిరుపతి అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలోని 15మంది పేద విద్యార్థులకు రూ.3లక్షల స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. యూఎస్ఏకు చెందిన దాత రొక్కం మోహన్, అనుశృతి, మనీష్ అందించిన ఆర్థిక సహకారంతో పిల్లలకు చేయూతనిచ్చారు. శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ మాధవి, డాక్టర్ శశిప్రభాకర్, అనిత, సిర్డ్స్ సంస్థ కార్యదర్శి మరుపూరు హేమశేఖర్ పాల్గొన్నారు.





నాగూరయ్య(ఫైల్‌ఫొటో) - స్వర్ణముఖిలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

స్వర్ణముఖినదిలో పశువుల కాపరి గల్లంతు

కోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోట మండలం రుద్రవరం స్వర్ణముఖినదిలో ఆదివారం యల్లశిరి నాగూరయ్య (47) అనే పశువుల కాపరి గల్లంతయ్యాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు... రుద్రవరం అరుంధతీయవాడకు చెందిన నాగూరయ్య తన గేదెలను మేతకోసం సమీపంలోని స్వర్ణముఖినది వద్దకు తోలుకెళ్లాడు. నదిలో నీళ్లు తాగడానికి వెళ్లిన గేదెలు ఎంతకి బయటకు రాకపోవడంతో నాగూరయ్య నదిలోకి దిగాడు. గేదెలను బయటకు తోలుతుండగా ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. గమనించిన సహచర పశువుల కాపరులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు వచ్చి నదిలో గాలించినా నాగూరయ్య ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో టీడీపీ నాయకుడు కృష్ణయ్య కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పొద్దుపోయేవరకు నదిలో గాలించినప్పటికీ నాగూరయ్య ఆచూకీ దొరకలేదు.

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోండి

గూడూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ రమణకుమార్ అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రల పరిరక్షణలో భాగంగా డిసెంబరు 31వ తేదీ రాత్రి పోలీస్‌శాఖ ఆంక్షలు అమలు పరచడం జరుగుతుందన్నారు. రాత్రిపూట ప్రజలు గుంపులుగా తిరగడం, పెద్దగా శబ్దాలు చేస్తూ మోటారు సైకిళ్లు నడపడం, రోడ్ల మీద కేక్‌లు కట్ చేయడం వంటి కార్యక్రమాలను నిషేధించామని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలంటే తప్పనిసరిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. డీజేలు, అసభ్యకరమైన నృత్యాలకు అనుమతి లేదన్నారు. ప్రధాన కూడళ్లలో పోలీస్ గస్తీని ముమ్మరం చేస్తామని, సాధారణ ప్రజా జీవనానికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన సంవత్సరం సందర్భంగా వాకాడు మండలం తూపిలిపాళెం బీచ్ సందర్శనను నిషేధించినట్లు తెలిపారు.

వెంకటగిరి టౌన్: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమణ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆయన మాట్లాడుతూ 31వ తేదీ పట్టణంలో ట్రాఫిక్ రూల్స్‌ని పటిష్టం చేస్తున్నామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఎస్‌ఐలు సుబ్బరావు, భవని, ఏఎస్‌ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య, దామెర ప్రసాద్‌నాయుడు, మురళీనాయుడు, కృష్ణమనాయుడు, మునిరామయ్య

పెళ్లకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతోనే నేడు ట్రూఅప్ చార్జీలు వసూలు చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం కొత్తూరులోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో చంద్రబాబునాయుడు మిగులు విద్యుత్‌తో జగన్‌కు అప్పజెప్పారన్నారు. గత వైసీపీ పాలనలో విద్యుత్ చార్జీలు అడ్డగోలుగా పెంచి ఇప్పుడు ధర్నాలు పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాడుపూరు మురళీ నాయుడు, శాఖమూరి కృష్ణమ నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిరామయ్య, నరేంద్ర యాదవ్, వేణురెడ్డి, పరుశురామ్, రవి, చంద్ర, రమణయ్య పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రమాదకరంగా చీమలవారి కాజ్‌వే

తాత్కాలిక చర్యలు శూన్యం ● కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు



ప్రస్తుతం మరో వైపు ఏర్పడిన రంధ్రం

వడమాలపేట, డిసెంబర్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చీమల వారి వంక కాజ్‌వేపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇరవై అడుగుల మేర కుంగడంతో వాహన రాకపోకలను నిలిపి వేసిన విషయం విదితమే. ఈ విషయమై ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ స్పందించి కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఈనెల 17న కాజ్‌వేను పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అయితే ఇంతవరకు కుంగిన కాజ్‌వే మరమ్మతులను పట్టించుకోకపోగా, మరోవైపు వాహనాల రాకపోకలు అనుమతించారు. ఆదివారం ఉదయం కాజ్‌వేకు మరో వైపు కూడా పెద్ద గుంత పడింది. దీంతో వడమాలపేటకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బైపాస్ మీదుగా కొనసాగుతున్నాయి. తిరుపతి, పుత్తూరుకు చేరుకోవడానికి వడమాలపేట పరిసర ప్రాంతాల ప్రజలు వ్యయప్రయాసల కోర్చి ఆటోల్లో బైపాస్ రోడ్డుకు చేరుకుని రాకపోకలు సాగిస్తున్నారు. కలెక్టర్ ఆదేశించినా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారలు యుద్ధప్రాతిపదికన కాజ్‌వేకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్‌లో పుత్తూరు నుంచి ఇద్దరికి పదవులు



పద్మావతి - డాక్టర్ రవిరాజు

పుత్తూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యవర్గంలో పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు పదవులు వరించాయి. ఆదివారం ఏలూరులో జరిగిన సమావేశంలో 2025 సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని, 2026 ఎలెక్ట్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో 2026 ఎలెక్ట్ ప్రెసిడెంట్‌గా పుత్తూరుకు చెందిన డాక్టర్ రవిరాజు ప్రస్తుత ప్రెసిడెంట్ మురళీమోహన్ నుంచి అధికార పత్రాన్ని స్వీకరించారు. అలాగే 2025 ప్రెసిడెంట్ పద్మావతితో పాటు 13మంది డిస్ట్రిక్ గవర్నర్లు అధికార పత్రాలను తీసుకుని ప్రమాణ స్వీకారం చేశారు. కాగా 2025 డిస్ట్రిక్ గవర్నర్‌గా పుత్తూరుకు చెందిన మాధవనాయుడు కూడా నేడు ప్రమాణస్వీకారం చేశారు. వీరి ఎంపికపై పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.ఎల్.ఎన్ మూర్తి, కార్యదర్శులు రఫీ అహమ్మద్, మునికృష్ణయ్య, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

పండుతున్న పాపాలు

- జగనన్న లేఅవుట్లలో స్థలం చదును పేరిట భారీగా నిధుల స్వాహా
- ఇప్పటికే రూ.60 కోట్లు చెల్లింపు
- ఇంకా రూ.33 కోట్లు పెండింగ్
- నేటి నుంచి విచారణ
- నాలుగు బృందాల ఏర్పాటు



కలువాయి మండలం మాదన్నగారిపల్లెలో వేసిన లేఅవుట్

నెల్లూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అందు కలదు.. ఇందులేదన్న.. సందేహము వలదు.. ఎందెందు చూసినా అందందే కనిపించెను అవినీతి.. అన్నట్లుగా తయారయ్యాయి గత ప్రభుత్వంలోని పరిస్థితులు. ఏ పథకంపై విచారణ జరిపినా అందులోని అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ఆఖరుకి పేదల ఇళ్ల మాటున నాడు జరిగిన దోపిడీకి అంతూపొంతూ లేదు. లేఅవుట్లకు స్థలాల కొనుగోలు దగ్గర నుంచి వాటిని చదును చేసే వరకూ రూ.వందల కోట్ల ప్రజాధనం స్వాహా జరిగినట్లు మొదటి నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క లేఅవుట్ల చదును మాటునే ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.50 కోట్లకు పైగా స్వాహా జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఇప్పటికి చెల్లించిందే ఎక్కువనుకుంటుంటే ఇంకా బిల్లులు చెల్లించాలంటూ కొందరు కోర్టును ఆశ్రయిస్తుండడంపై ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించింది. డ్వామా ద్వారా బిల్లుల చెల్లింపు జరిగిన అన్ని లేఅవుట్లను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించేందుకు కలెక్టర్ ఆనంద్ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈ బృందాలు విచారణ ప్రారంభించనున్నాయి. ఈ విచారణ పూర్తయితే అక్రమాల బాగోతం వెలుగులోకి రానుంది. దీంతో ఇప్పటికే అక్రమార్కుల్లో వణుకు పుడుతోంది.

గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతి గ్రామంలోనూ భూమిని సేకరించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో సుమారు రెండు వేల లేఅవుట్లను వేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా భూమిని చదును చేశారు. డ్వామా నుంచి 1170 లేఅవుట్లకు రూ.59.85 కోట్లను బిల్లులు కింద ఇప్పటికే చెల్లించారు. ఎంబుక్‌ల ప్రకారం ఇంకా రూ.33 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని వైసీపీ నేతలు కోర్టును ఆశ్రయిస్తున్నారు.

భారీ దోపిడీ

లేఅవుట్ల చదునుకుగానూ క్యూబిక్ మీటర్ గ్రావెల్‌కు రూ.135 చెల్లించేలా నిర్ణయించారు. అప్రూవల్ క్వారీ నుంచి తీసుకువచ్చిన గ్రావెల్‌కే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. అలా కాకుండా తహసీల్దార్ల అనుమతితో ప్రభుత్వ భూముల్లో నుంచి గ్రావెల్‌ను తీసుకెళితే రూ.50 తగ్గించి క్యూబిక్ మీటర్‌కు రూ.85 చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో మెజారిటీ లేఅవుట్లకు ప్రభుత్వ భూముల నుంచే గ్రావెల్‌ను తరలించారు. కానీ బిల్లుల దగ్గరికి వచ్చే సరికి రూ.135 చొప్పున చెల్లించారు. అలానే విత్‌హెల్డ్ మొత్తం 25 శాతం ఉంచాలని ప్రభుత్వం ఆదేశిస్తే చాలామందికి 10 శాతం మాత్రమే ఉంచి మిగిలిన 15 శాతం చెల్లించేశారు. ఇలా ఇప్పటికి సుమారు రూ.60 కోట్ల వరకూ బిల్లులు చెల్లించారు. అయితే కొన్నిచోట్ల అవసరం లేకపోయినా తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకున్నారు. కొన్నిచోట్ల చేసిన పనికి, రికార్డుల్లో నమోదైన వివరాలకు వ్యత్యాసం ఉంటోంది. ఇటువంటి అవకతవకలు గతంలోనే వెలుగులోకి వచ్చినా నాడు పట్టించుకోలేదు. క్షేత్రస్థాయి విచారణ జరిపితే ఇప్పటికి చెల్లించిన మొత్తమే చాలా ఎక్కువగా ఉంటుందని డ్వామా వర్గాలు చెబుతున్నాయి.

నాలుగు బృందాలతో విచారణ

లేఅవుట్ల చదును పేరుతో జరిగిన అవినీతిని బయటకు తీసేందుకు ప్రభుత్వం విచారణకు ఆదేశించగా, అందుకు జిల్లాలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్‌తో పాటు ఈసీలు, టీఏలు ఈ బృందాల్లో సభ్యులుగా ఉన్నారు. సోమవారం నుంచి ఈ బృందాలు విచారణ ప్రారంభించనున్నాయి. లేఅవుట్లను గ్రావెల్‌తో చదును చేశారా..? ఈ గ్రావెల్‌ను అప్రూవల్ క్వారీ నుంచి తీసుకొచ్చారా.. లేక ప్రభుత్వ భూముల నుంచా..? ఎంబుక్‌లో రికార్డు మేరకు పని జరిగిందా..? బిల్లులు చెల్లింపు నిబంధనల ప్రకారం జరిగిందా.. లేదా..? విత్‌హెల్డ్ మొత్తం ఎంత ఉంచారు..? ఎంత చెల్లించేశారు..? అన్నది విచారణలో పరిశీలిస్తారు.

నేటి నుంచి విచారణ

పేదలందరికీ ఇళ్లు పథకంలో జరిగిన లేఅవుట్ల చదునుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా జిల్లాలో క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్ సిబ్బందితో నాలుగు విచారణ బృందాలను ఏర్పాటు చేశాం. సోమవారం నుంచి ఈ బృందాలు విచారణ చేపడతాయి. విచారణ పూర్తయ్యాక ఆ నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తాం.

- గంగాభవాని, డ్వామా పీడీ

వైసీపీ ధర్నా చేయడం హాస్యాస్పదం: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నేతలు సుధాకర రెడ్డి, రమేష్, మాధవ నాయుడు, సంచి కృష్ణయ్య, శ్రీనివాసులు

సూళ్లూరుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందంటూ వైసీపీ ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం ఆమె తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 2014లో చంద్రబాబు నాయుడు సీఎం అయినప్పుడు 22.5 మిలియన్ల యూనిట్ల లోటు ఉండగా 2019లో మిగులు విద్యుత్ ఉత్పత్తి ఉందన్నారు. జగన్‌లో చేతగాని పాలనతో 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. విద్యుత్ కొరతను సృష్టించి బహిరంగ మార్కెట్లలో అధిక రేట్లకు కొనుగోలు చేసి రూ.2700 కోట్లు నష్టం వచ్చేలా చేసిన పాపం జగన్‌దేనని, ఈ విషయం వైసీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. సెకీ ఒప్పందం వల్ల ఏడాదికి రూ.3850 కోట్ల చొప్పున 30 సంవత్సరాల పైబడి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెంచిదంటూ ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కుదేలైన విద్యుత్ రంగాన్ని మళ్లీ పుంజుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తుంటే వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకరరెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మాధవ నాయుడు, నాయకులు అలవల శ్రీనివాసులు, బొమ్మన్ పళణి, కొలవి శెల్వం, సంచి కృష్ణయ్య, టీకే శ్రీనివాసన్, వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి కేసు విచారణ



మన్నూరులో బాధితులను విచారిస్తున్న డీఎస్పీ రమణకుమార్

బాలాయపల్లి, డిసెంబరు 29,(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నూరు గ్రామంలో భూ వివాదమై దళితులపై జరిగిన దాడి కేసును గూడూరు డీఎస్పీ రమణకుమార్ ఆదివారం విచారించారు. బాధితులు మాట్లాడుతూ స్థానిక బీసీ కాలనీకి చెందిన జడపల్లి సురేష్, జడపల్లి బాబు, జడపల్లి శ్రీనివాసులు మరికొందరితో కలిసి తమపై దాడి చేసి గాయపరిస్తే పోలీసులు తమ ఫిర్యాదును పరిగణలోకి తీసుకోలేదన్నారు. పైగా తమపైనే కేసులు పెట్టారని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపి, ఏఎస్‌ఐ మాల్యాద్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

వెంకటగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగయ్య జూనియర్ కళాశాలలో పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామ నాగేశ్వరరావు, పద్మశాలి సంఘ నాయకులు వేణు, సూరిబాబు, రవికుమార్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, శ్యామ్, రమణయ్య, బాలాజీ, మునికోటి, రాజేంద్ర కుమార్, గొట్టిముక్కల రామచంద్రయ్య పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

నాయుడుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తలకు పార్టీ భరోసా లభిస్తుందని నాయుడుపేట మాజీ సర్పంచు గూడూరు ప్రభావతి అన్నారు. ఆదివారం నాయుడుపేటలో టీడీపీ సభ్యత్వ చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, తిరుమలరావు, కిషోర్, సుబ్బారెడ్డి, రఫీ, సాయిహేమంత్, నవీన్ పాల్గొన్నారు.

మందుల పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న ఏపీపీ ప్రకృతి కుమార్, గోపీనాథ్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో స్వామి వివేకానందా యువసైన్యం ఆధర్యంలో ఏపీపీ ప్రకృతికుమార్ ఆదివారం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీనస్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత కోవి వెంకన్నబాబు, యువసైన్యం సభ్యులు ఫణీంద్ర, గోపీనాద్, శ్యాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చిల్లకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడకు చెందిన శంకరమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె అంత్యక్రియలకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. మస్తానయ్య, సుధాకర్, సాయివెంకటకృష్ణ, ఆనందయ్య పాల్గొన్నారు.

108 ఉద్యోగులకు జీతం పెంపు హర్షణీయం

నాయుడుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 108 వ్యవస్థలో పనిచేస్తున్న ఈఎంటీ, పైలెట్ ఉద్యోగులకు జీతం రూ.4వేలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని 108 కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్ ఆదివారం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో శనివారం జరిగిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, అధికారుల సమీక్షా సమావేశంలో 108 వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతం పెంపుదలకు తీసుకున్నట్లు తెలిపారు. 2014లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు 108 ఉద్యోగుల కష్టాలను గుర్తించి జీవో నెంబరు ఎంఎస్ 49 ద్వారా నెలకు రూ4వేలు వేతనాలను పెంచారని గుర్తు చేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వం 108 కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.4వేల జీతం పెంపుదల నిర్ణయం సంతోషకరమన్నారు.

పేదలకు దుస్తులు, దుప్పట్ల పంపిణీ



పేదలకు దుస్తులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

గూడూరు అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదనగర్ సమీపంలోని గిరిజన కాలనీలో ఆదివారం పీపుల్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మల్లికార్జున్, కొండా రామచంద్రారెడ్డి, బెల్లంకొండ రాజేంద్ర, మధు, సురేష్‌బాబు, బాలరమణయ్య, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నెల్లటూరు సమీపంలోని గిరిజనకాలనీ వద్ద కృపాసేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ గోపీనాథ్

నాయుడుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మహేర్ ఆశ్రమంలోని వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు, మానసిక వికలాంగులకు డాక్టర్ గోపీనాథ్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

దుప్పట్లు.. దోమతెరల పంపిణీ

కోట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలో గల వావిళ్లదొరువు, యమదిన్నెపాళెం, గున్నంపడియా గ్రామాల్లోని 100 మంది పేదలకు షిరిడీ సాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ రావూరి చంద్రాచారి దాతృత్వంతో ఆదివారం దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, టీడీపీ నాయకులు వాటంబేటి చెంగల్‌రావు, వెంకటయ్యగౌడ్, మస్తానయ్య గౌడ్, ఆవుల సుబ్బయ్య, తదతరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌పై క్లిక్ చేస్తే... బ్యాంకు ఖాతాలో రూ.లక్ష మాయం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌పై క్లిక్ చేస్తే బ్యాంకు ఆమె ఖాతాలో నుంచి రూ.లక్ష మాయమైంది. దొరవారిసత్రం మండలానికి చెందిన ఓ మహిళ నాయుడుపేట పట్టణంలోని ఓ ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహిస్తోంది. గత గురువారం ఆ మహిళ సెల్‌ఫోన్‌కు ఒక లింక్ వచ్చింది. దానిపై క్లిక్ చేయగా బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.లక్ష డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. బాధితురాలు బ్యాంక్‌కు వెళ్లి తన ఖాతా వివరాలను తెలుసుకోగా రూ.లక్ష డ్రా అయినట్లు తెలిసింది. దీంతో తిరుపతిలోని సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో విందు



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ఆవరణలో విందు చేసుకొంటున్న నాయకులు, అధికారులు

సూళ్లూరుపేట, డిసెంబరు 29: సూళ్లూరుపేటలోని గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) కార్యాలయంలో విందు నిర్వహించడం విమర్శలు వెల్లువెత్తాయి. పట్టణం నడిబొడ్డులో తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు నున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఆదివారం ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులు, పట్టణానికి చెందిన పలువురు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో విందు ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఉపాధ్యాయ ఉద్యమ దిక్సూచి యూటీఎఫ్



ప్రచారజాతలో యూటీఎఫ్ నాయకులు

నాయుడుపేట టౌన్, వెంకటగిరిటౌన్, డిసెంబరు 29,(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ దిక్సూచి యూటీఎఫ్ అని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం కోరుతూ తిరుపతి నుంచి కాకినాడకు వెళ్తున్న యూటీఎఫ్ ప్రచారజాత ఆదివారం సాయంత్రం నాయుడుపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50వసంతాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను కాకినాడలో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్, ముత్యాల్‌రెడ్డి, రామచంద్రాయ్య, నిర్మల, ఆదినారాయణ, గోవర్ధన్‌రెడ్డి, సునీల, నాగరాజు, శివప్రసాద్, సుబ్బారావు, శంకరయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వెంకటగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కుమారస్వామి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, మండల ప్రధాన కార్యదర్శి సోమశేఖర రావు, ఎం.వెంకటేశ్వర్లు, సరస్వతి, శ్రీనివాసులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



ర్యాలీలో విద్యార్థులు ఎక్సైజ్ అధికారులు, గురుకుల ప్రిన్సిపాల్, సిబ్బంది

ఓజిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం చిల్లమానుచేను గురుకుల పాఠశాలలో ఆదివారం గూడూరు, నాయుడుపేట ఎక్సైజ్ సీఐలు బాకృష్ణ, అరుణకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ జ్యోతిరావు, అధ్యాపకులు, ఎక్సైజ్ అధికారులు ర్యాలీ నిర్వహించారు.

ఉపాధ్యాయురాలికి ఉత్తమ మోటివేషన్ అవార్డు



ప్రశంసా పత్రం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు అరుణకుమారి

సూళ్లూరుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటకు చెందిన ఉపాధ్యాయురాలు డాక్టర్ కొప్పోలు అరుణకుమారికి ఉత్తమ మోటివేషన్ అవార్డు లభించింది. హైదరాబాదుకు చెందిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థలో వారం రోజుల పాటు వ్యక్తుల నైపుణ్యానికి సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అరుణకుమారి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. ఇంపాక్ట్ ఫౌండర్ గంపా నాగేశ్వరరావు, అధ్యక్షుడు శ్రీనివాస్ సోను చేతుల మీదుగా ఉత్తమ మోటివేషన్ అవార్డు అందుకున్నారు.

బీసీ బాలికల హాస్టల్ తనిఖీ

నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫోన్


విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ దుస్థితిపై ఎమ్మెల్యే ఆదిమూలం ఆరా తీశారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే బీసీ సంక్షేమ హాస్టల్ పరిశీలించారు. హాస్టల్‌లోని తరగతి గదుల్లో పైకప్పు పెచ్చులూడి అధ్వానంగా ఉండడాన్ని గుర్తించారు. కిటికీలు, తలుపులు లేని గదులను పరిశీలించారు. దుప్పట్లు ఎక్కడా అని ఎమ్మెల్యే వార్డెన్‌ని అడగ్గా మంజూరు కాలేదని సమాధానం ఇచ్చారు. దీంతో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్లేట్లు, గ్లాసులు కూడా గత నాలుగేళ్లుగా ఇవ్వలేదని వివరించారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని తిన్నారు. అధ్వానంగా ఉన్న పిచ్చాటూరు బీసీ సంక్షేమ హాస్టల్‌కు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఫోన్ ద్వారా ఎమ్మెల్యే కోరారు. ఎంపీడీవో మహ్మద్‌రఫీకి ఫోన్ చేసి మండల గ్రాంట్ ద్వారా వెంటనే హాస్టల్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అరణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, మాజీ ఎంపీపీ మురళి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ నాయకులు బలరాంరెడ్డి, అరుల్ ప్రకాష్, రజని, హాస్టల్ వార్డెన్ గీత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపండి


అవగాహన కల్పిస్తున్న శంకర్

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త శంకర్ తెలిపారు. మండల కేంద్రంలోని సహజ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రసాయనిక ఎరువులతో పండించిన పంటలు తిన్న వారు వివిధ రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఆవు పంచతంతో తయారు చేసిన ఎరువులను వాడితే దిగుబడి పెరుగుతుందని ఖర్చు కూడా ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సురేష్ నాయుడు, ప్రకృతి వ్యవసాయ జిల్లా నాయకుడు కన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం స్థల పరిశీలన


ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఈవో, ఆర్డీవో తదితరులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నిర్మించబోయే రోడ్డు కోసం అధికారులు స్థల పరిశీలన చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మాస్టర్ ప్లాన్ పనుల్లో భాగంగా భక్తుల వాహనాలను సన్నిధివీధి నుంచి లోబావికి మళ్లించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. భరద్వాజ తీర్థంలో మొత్తం వాహనాల పార్కింగ్ చేయించేలా కసరత్తు చేస్తున్నారు. రానున్న మహాశివరాత్రి లోగా సన్నిధివీధిలో పూర్తిగా ట్రాఫిక్ సమస్యను నిర్మూలించేందుకు 40 అడుగుల వెడల్పుతో కొత్త రోడ్డు నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి అధికారులతో కలిసి సన్నిధివీధిలోని ఎంజీఎం హోటల్ పక్కన స్వర్ణముఖి నది కట్ట, టూరిస్టు బస్టాండు, భరద్వాజ తీర్థం ప్రాంతాల్లో పర్యటించారు. అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా 17సెంట్ల ప్రైవేటు స్థలాన్ని సేకరించాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించారు. ల్యాండ్ అక్విజిషన్ ద్వారా భూసేకరణ చేసేందుకు కసరత్తు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో సర్వేయర్ పురుషోత్తం, ఆలయ ఈఈ మురళీధర్‌రెడ్డి, డీఈ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపుస్మా రాయలసీమ అధ్యక్షుడిగా విశ్వనాథరెడ్డి


విశ్వనాథరెడ్డిని అభినందిస్తున్న అపుస్మా నేతలు

తిరుపతి(విద్య), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్(అపుస్మా) రాయలసీమ జోన్ అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన విశ్వం స్కూల్స్ అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర నేతలు, సహకరించిన కరస్పాండెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తులసివిష్ణుప్రసాద్, లీగల్ అడ్వైజర్ కేఎస్‌వాసు, రెడ్డి శ్రీధర్‌రెడ్డి, సంగరాజు భాస్కర్‌రాజు, టి.రామకృష్ణారెడ్డి, డీజీ రఘునారాయణ, బి.వెంకటేశ్‌బాబు, మనోహర్ తదితరులు ఆయన్ను అభినందించారు.

బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో

ఆటలు, ముగ్గుల పోటీలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సమాజ నాయకులు

రేణిగుంట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ వేడుకలు అప్పుడే ప్రారంభమయ్యాయి. పట్టణంలోని బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల పేరుతో ఆటలు, ముగ్గుల పోటీలను నిర్వ హించారు. రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి రెడ్డిప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలు నువ్వానేనా అన్నట్లుగా ఆసక్తికరంగా సాగాయి. పోటీల అనంతరం విజేతలకు బహుమ తులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు మాట్లాడు తూ తిరుపతి బైరాగి పట్టెడలోని వైఖానస కల్యాణ మండపంలో ఫిబ్రవరి 16న రాష్ట్ర బ్రాహ్మణ వధూవరుల వివాహక పరిచయ వేదిక కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమైక్య, బ్రాహ్మణ సమాజం సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు.

మోటర్లు, స్టార్టర్ల చోరీని అరికట్టండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలోని గురుకులపాళెం, కొమ్మనుగుంట, గాపచేను, చిన్నకన్నలి తదితర గ్రామాల్లో శనివారం రాత్రి బాక్సులు పగులగొట్టి స్టార్టర్లు చోరీ చేశారు. రాత్రివేళ మంచు ప్రభావంతో పొలాలకు వెళ్లకపోవడంతో ఇదే అదనుగా కొందరు దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఆదివారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు స్టార్టర్లు చోరీకి గురైన విషయాన్ని గమనించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా కాసరం నుంచి తెలుగుగంగ కాలువపై మోటర్ల స్టార్టర్లకు రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళి నాయుడు మాట్లాడుతూ తొట్టంబేడు, రెండవ పట్టణ పోలీసులు విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి

ఏర్పేడు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జనసేన బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత కోరారు. రేణిగుంటలోని తన స్వగృహంలో ఏర్పేడు మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం

- ప్రబలుతున్న విషజ్వరాలు
- పట్టించుకోని అధికారులు


అశోక్‌నగర్‌లో శుభ్రం చేయకపోవడంతో పేరుకుపోయిన మురుగు నీటి కాలువలు




జంగాలపల్లి దళితవాడలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు

ఏర్పేడు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశోక్‌నగర్‌లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. 130కుటుంబాల వారు నివసిస్తున్నారు. ఈ కాలనీలో సుమారు ఆరు వీధులున్నాయి. అన్ని వీధుల్లో మురుగు కాలువలు ఉన్నప్పటికీ వాటిని శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం ముందుకు కదలడం లేదు. ఈ క్రమంలో దోమలు వృద్ధి చెంది గ్రామస్తులు జ్వరాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులకు కాలువలను శుభ్రం చేయాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జంగాలపల్లి దళితవాడ వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తోంది. ఉన్న మూడు వీధుల్లో రెండింట్లో మురుగు నీటి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురగు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురగునీటి కాలువలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు కేంద్ర మంత్రి రాక

రేణిగుంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి పంచాయతీలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రానికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ రానున్నారు. ఢిల్లీ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకుని శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్తారు. తర్వాత కరకంబాడిలోని కేవీకెను సందర్శించనున్నారు. మంత్రితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు రానున్నట్లు ఈ కేంద్రం నిర్వాహకుడు డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

నేత్రదాతకు నివాళులు

వరదయ్యపాళెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమిట్టకు చెందిన ఎం.ఎం.హరికృష్ణ శనివారం మరణించారు. దీంతో కుటుంబ సభ్యులు సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సంస్థకు సమాచారం అందించారు. శంకర నేత్రాలయ వైద్యులు గంగమిట్టకు చేరుకుని హరికృష్ణ నేత్రాలను సేకరించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



శ్రీకాళహస్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త మునిరాజా ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ మునిరాజా ఇంటికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా దిలీప్‌రాయల్


దిలీప్‌ను సన్మానిస్తున్న చంద్రారెడ్డి

వరదయ్యపాళెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేపీజీ కల్యాణ మండపంలో ఆదివారం బీజేపీ క్రియాశీల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దిలీప్‌రాయల్‌ను వరదయ్యపాళెం బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈయనను జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప సన్మానించారు. మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని దిలీప్‌రాయల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసుబ్రహ్మణ్యం, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిద్ధులయ్య, సుబ్బరత్నమ్మ, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగండి

ఏర్పేడు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అవకాశాలను సద్వినియోగం చేసుకుని గిరిజన మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలని వక్తలు అన్నారు. మండలంలోని రాజులపాళెం గిరిజన కాలనీలో స్పెయిన్‌కు చెందిన రవి రాట్ల ఆర్థిక సాయంతో 12మంది మహిళలకు మూడు నెలలపాటు టైలరింగ్ శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆదివారం వారికి కుట్టు మెషిన్లు పంపిణీ చేశారు. మేరీ, రవి, శ్రీనివాసులు, ఈశ్వర్‌రెడ్డి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బాల్యంలో అనుబంధం... 20ఏళ్ల తరువాత కలుసుకున్న క్షణంతో ఉప్పొంగిన సంతోషం... ఆప్యాయత, ఆత్మీయతతో కలుసుకున్న భావోద్వేగ క్షణాలకు పట్టణంలోని సెయింట్ జేవియర్ పాఠశాల ఆదివారం వేదికైంది. ముందుగా 2004-05 సంవత్సర టెన్త్ చదివిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో తమకు విద్యను నేర్పిన గురువులను సాదరంగా వేదికపైకి ఆహ్వానించి సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులకు తమకు ఉన్న అనుబంధాన్ని నెమరవేసుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము విద్య నేర్పిన విద్యార్థులు ఉన్నతస్థానాల్లో ఉండటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ షర్లిన్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా క్రీడా పోటీలు


బహుమతులతో విద్యార్థులు

వరదయ్యపాళెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వచ్ఛ్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరిగాయి.ఇ. వాలీబాల్ పోటీల్లో 32 జట్లు పాల్గొనగా మండలంలోని చిలమత్తూరు విజేతగా నిలిచింది. అదే విధంగా కబడ్డీ పోటీల్లో 8 జట్లు పాల్గొనగా వరదయ్యపాళెం దళితవాడ జట్టు విజయం సాధించింది. వీరికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మావుడూరు మోహన్, మునిచంద్రారెడ్డి, ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి, నాగార్జున, మహేష్, మయూరి తదితరులు పాల్గొన్నారు.